సహకార రంగంలో అభివృద్ధి పరుగులు

- 30 సహకార సంఘాల్లో రూ.11 కోట్లతో అభివృద్ధి
- రైతులకు మెరుగైన సేవలు
- విద్యార్థుల విదేశీ విద్యకు సైతం రుణాలు



నిర్మాణం పూర్తి చేసుకున్న వత్సవాయి సహకార సంఘ భవనం

జగ్గయ్యపేట: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయంతో పాటు సహకార రంగాన్ని అన్ని విధాలుగా బలోపేతం చేస్తోంది. అందులో భాగంగానే రాష్ట్రంలో అన్ని సహకార సంఘాలను అభివృద్ధి చేస్తూ, బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తూ, ఇతర బ్యాంక్‌లతో పోలిస్తే సహకార బ్యాంక్‌ల్లో తక్కువ వడ్డీతో రుణాలు పొందేలా అవకాశం కల్పిస్తూనే ఏళ్ల తరబడి కునారిల్లుతున్న సహకార సంఘాల భవనాలను ఆధునీకీకరిస్తున్నారు.

నియోజకవర్గంలో...

జగ్గయ్యపేట నియోజకవర్గంలో జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి, నందిగామ ఏటిపట్టు గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్)ను కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో మరమ్మతులతో పాటు నూతన భవనాల నిర్మాణాలను బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను చొరవతో చేపట్టారు. సుమారు రూ.11 కోట్లతో 30 సహకార సంఘాల్లో శిథిలావస్థలో ఉన్న వాటిని తొలగించి నూతన భవనాలు నిర్మించటంతో పాటు మరికొన్ని వాటికి మరమ్మతులు చేయించారు. దీంతో ఏళ్లతరబడి ఉన్న సమస్యలు పరిష్కారమయ్యాయని సహకార సంఘాల అధ్యక్షులతో పాటు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సహకార సంఘాల ద్వారా పెట్రోల్ బంక్‌ల నిర్వహణ....

గతంలో ఎన్నడూ లేనివిధంగా సహకార సంఘాల ద్వారా పెట్రోల్ బంక్‌లు నిర్వహిస్తున్నారు. పెనుగంచిప్రోలులో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ మంచి లాభాల బాటలో పయనించటంతో పాటు పలువురికి ఉపాధి కల్పిస్తోంది. ముండ్లపాడులో పెట్రోల్ బంక్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. సహకార సంఘాల ద్వారా విద్యార్థుల విదేశీ విద్యకు 50 మందికి సుమారుగా రూ.15 కోట్ల రుణాలు అందజేశారు.

ఉత్పత్తుల భద్రతకు గోడౌన్ల సదుపాయం....

గత ప్రభుత్వాలు చేయలేని విధంగా రైతులు తాము పండించిన ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సెంటర్ (ఎంపీఎఫ్‌సీ) గోడౌన్లు అనుమంచిపల్లి, అన్నవరం, తోటచర్ల, బూదవాడ గ్రామాల్లో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేశారు. పూర్తిగా శిథిలమైన సంఘాల భవనాలు నియోజకవర్గంలో వత్సవాయి, కంభంపాడు, మల్కాపురం, శనగపాడు, తోటచర్ల, అనిగండ్లపాడు, పోచంపల్లి, బండిపాలెం, మంగొల్లు, మాగల్లు, సహకార సంఘాలు పూర్తి అధునికీకరణతో కార్పొరేట్ బ్యాంక్ హంగులు ఏర్పాటు చేసుకున్నాయి. స్ట్రాంగ్ రూమ్‌లు, లాకర్ సదుపాయం, బంగారు రుణాల సౌకర్యంతో పాటు అత్యాధునికమైన క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశారు.

రూ.2.40 కోట్లతో విస్తృత సదుపాయాలు...

ఎంతో ప్రతిష్ఠాతకంగా పట్టణంలోని కోదాడ రోడ్డులో ఎంతో చరిత్ర గల ది జగ్గయ్యపేట గోపాల కృష్ణ విశాల సహకార పరపతి సంఘం రూ.2.40 కోట్లతో నూతన భవనం నిర్మాణంతో పాటు కమర్షియల్ కాంప్లెక్స్, గోడౌన్లు, స్ట్రాంగ్ రూమ్ నిర్మాణం చేపడుతున్నారు. వత్సవాయిలో రూ.1.04 కోట్లతో నూతన సహకార సంఘ నిర్మాణంతో పాటు అన్ని రకాల సేవలు అందుబాటులోకి తెచ్చారు.

రైతులకు విశేష సేవలు



వ్యవసాయం, సహకార రంగాలకు ముఖ్యమంత్రి సమ ప్రాధాన్యం ఇస్తూ రైతులకు విశేష సేవలందిస్తున్నారు. సహకార సంఘాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా ఎకరానికి రూ.8 లక్షల రుణాలు ఇవ్వటంతో పాటు విద్యార్థుల విదేశీ విద్యకు ఏ బ్యాంక్‌లు ఇవ్వని విధంగా రుణాలు అందిస్తున్నారు. నియోజకవర్గంలో సహకార సంఘాలను గత ప్రభుత్వంలో లేని విధంగా అభివృద్ధి చేయటం జరిగింది.

–సామినేని ఉదయభాను, ప్రభుత్వవిప్

అభివృద్ధి పథంలో సహకార సంఘాలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సహకార సంఘాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. నియోజకవర్గంలో ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను కృషితో రూ.11 కోట్లతో నూతన సహకార సంఘాల భవనాల నిర్మాణం, మరమ్మతులు, గోడౌన్ల నిర్మాణాలు చేపట్టాం. ఉదయభాను కృషితో వచ్చిన పదవి ద్వారానే సహకార సంఘాల అభివృద్ధికి తన వంతు కృషి చేశాను. సంఘాల్లో సభ్యులుగా ఉన్నవారు ప్రమాద వశాత్తు మరణిస్తే బీమా కింద కుటుంబసభ్యులకు రూ.1లక్ష తక్షణం అందిస్తున్నాం. ఒక్కో రైతుకు అర్హతను బట్టి రూ.8 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు రుణం ఇస్తున్నాం.

–తన్నీరు నాగేశ్వరరావు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్

అడిగిన వెంటనే రుణం



గతంలో రుణం కావాలంటే నెల రోజులు తిరిగినా ఫలితం ఉండేది కాదు. ఇప్పుడు అడిగిన వెంటనే అన్ని అర్హతలు ఉంటే వారం రోజుల వ్యవధిలోనే అందిస్తున్నారు. నేను 6 ఎకరాలకుగాను రూ.18 లక్షల రుణం తీసుకున్నాను. సక్రమంగా చెల్లిస్తుండటంతో ఎప్పుడు కావాలన్నా ఇస్తున్నారు.

–గుమ్మా వెంకటేశ్వర్లు, రైతు, కొళ్లికూళ్ల

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు


జీర్ణోద్ధరణకు గురైన ఆలయం

మక్కపేట(వత్సవాయి): గ్రామంలో జీర్ణోద్ధరణకు చేరిన పురాతన ఆలయాన్ని తొలగించనున్నారు. సుమారు 400 ఏళ్ల క్రితం గ్రామంలో అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరస్వామి నిర్మాణం జరిగినట్లు పెద్దలు చెబుతున్నారు. దేవదాయశాఖకు చెందిన ఈ ఆలయంకు 11 ఎకరాల వ్యవసాయ మాన్యం కూడా ఉంది. రెండు సంవత్సరాల క్రితం కొందరు దుండుగులు ఆలయంలో స్వామివారికి ఎదురుగా ఉన్న నంది విగ్రహం చెవుల్లో వజ్రాలు, బంగారం ఉందనే అపోహతో నంది చెవులను పగలగొట్టారు. ఆలయం జీర్ణోద్ధరణకు చేరడంతోపాటు దుండుగులు నంది చెవులు పగలగొట్టడంతో నూతనం ఆలయం నిర్మాణం చేయాలని గ్రామస్తులు తీర్మానించుకున్నారు. ఈ మేరకు విషయాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దేవదాయశాఖాధికారులతో మాట్లాడి నూతన ఆలయ నిర్మాణం కోసం రూ.75 లక్షలు మంజూరుచేయించారు. గత నెలలో ఆలయంలో స్వామివార్ల విగ్రహాలను వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ బాలాలయం ఏర్పాటుచేసి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని తొలగించి కొత్త ఆలయాన్ని నిర్మాణం చేసేందుకు మే నెలలో శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ ఈవో సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు తెలిపారు. కొత్త ఆలయం నిర్మా ణం గురించి అడిగిన వెంటనే స్పందించి నిధులు మంజూరుచేయించినందుకు ఎమ్మెల్యే ఉదయభానుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

గ్రామాభివృద్ధికి దాతలు సహకరించాలి


మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న విప్ ఉదయభాను

రామచంద్రునిపేట(జగ్గయ్యపేట): గ్రామాభివృద్ధికి దాతలు సహకరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. గ్రామంలో బొండాడ బ్రిక్స్ ప్రొడక్ట్స్, ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ సామినేని వెంకట కృష్ణప్రసాద్ వితరణతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్, తాగునీటి బోర్లను ఆదివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని దాతలు కూడా ముందుకు రావాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామం కూడా ఇటీవలనే గ్రామ పంచాయతీగా ఏర్పడిందని చెప్పారు. శ్మశానవాటికలలో దాత దండు పుల్లయ్య వితరణతో ఏర్పాటు చేసిన బోర్లను కూడా ఆయన ప్రారంభించారు. సర్పంచ్ మద్దుల రామకృష్ణ, వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ గ్రామ కన్వీనర్ రాయల నరసింహారావు, నాయకులు చుక్కా రవి, ప్రసాద్, తుమ్మలపల్లి అప్పారావు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, అనంత రాములు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ఆదివారం గాయత్రీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీగాయత్రీ కల్యాణమండపంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గాయత్రీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కలవకొలను వీరాంజనేయశర్మ (వామన) ఆధ్వర్యంలో నేతృత్వంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కొడాలి శ్రీలక్ష్మి, డాక్టర్ ఈశ్వర ప్రగడ భారతి, డాక్టర్ భారతి, డాక్టర్ పి.సుబ్బారావు వైద్య శిబిరంలో పాల్గొని గ్యాస్ట్రో ఎంటరాలజీ, బీపీ, షుగర్, కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని డాక్టర్ కొడాలి శ్రీలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు వీరాంజనేయశర్మ మాట్లాడుతూ వైద్యశిబిరం నిర్వహణకు డాక్టర్ శ్రీలక్ష్మి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేశారని చెప్పారు. ఎందరో ప్రముఖులు ఈ వైద్యశిబిరం నిర్వహణకు తమ సహకారాన్ని అందజేశారని తెలిపారు. వారికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వైద్యశిబిరం ప్రతి నెల చివరి ఆదివారం జరుగుతుందన్నారు. బ్రాహ్మణ సంఘ నేత, ప్రముఖ న్యాయవాది ఈశ్వరప్రగడ జగన్నాథరావు, న్యాయదాదులు యలమంచిలి రాజేంద్రప్రసాద్, మధు, కొడాలి అపర్ణ, జి.నాగమణి, బ్రాహ్మణ సంఘ ప్రముఖులు పిల్లలమర్రి నాగకృష్ణశర్మ, సంఘ ప్రధాన కార్యదర్శి మాడపాటి కిషోర్, కోశాధికారి మంగు చైతన్యశర్మ, కొమరగిరి భరద్వాజ్ పాల్గొన్నారు.

అన్ని మండలాల్లో విశ్వబ్రాహ్మణ కమిటీలు


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులతో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు

పెనుగంచిప్రోలు: వంద రోజుల ప్రణాళిక ఏర్పాటు చేసుకుని అన్ని మండలాల్లో విశ్వబ్రాహ్మణ సంఘ కమిటీలు ఏర్పాటు చేస్తామని ఎన్టీఆర్ జిల్లా సంఘ అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక రామాలయ వేదిక ఆవరణలో సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంతో పాటు మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మండలాల కమిటీల నియామకం పూర్తి చేసుకుని జిల్లా స్థాయిలో విస్తృత సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. అందరికీ ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేస్తామన్నారు. విశ్వబ్రాహ్మణులు ఐక్యతతో అన్నీ సాధించుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా నంచర్ల గోపాలరావు, తునికిపాటి శివ, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా పులికొండ మాధవి, తునికిపాటి కుమారి, జిల్లా కోశాధికారిగా పి సాంబశివరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి రంగబాబు, జిల్లా గౌరవాధ్యక్షులు డి శోభన్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షులు వెలిశాల ఏడుకొండలు, క్రమశిక్షణా కమిటీ చైర్మన్ చల్లాల శివాజీ, జిల్లా మహిళా అధ్యక్షురాలు రంగు జయప్రద, జిల్లా ప్రధాన కార్యదర్శి శనగపాటి జయలక్ష్మి, విశ్వబ్రాహ్మణ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దేవు చంద్రశేఖర్, ఎన్నికల నిర్వాహకులు టి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు


అమ్మవారి దర్శనానికి వస్తున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవులతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేలాది వాహనాలు తరలి రావటంతో ఆదివారం పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రం పెద్ద నగరాన్ని తలపించింది. ఆంధ్రా నుంచే కాక తెలంగాణలోని పలు జిల్లాల నుంచి వందల వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు వాహనాల రద్దీ కొనసాగింది. భక్తులు అమ్మవారికి మొక్కు తీర్చుకున్న తరువాత ఉదయం నుంచి సాయంత్రం వరకు మునేరు అవతల ఉన్న మామిడి తోటల్లో గడిపారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లు సమర్పించి మామిడి తోటల్లో వంటలు వండుకొని కుటుంబసభ్యులు, బంధువులు అందరూ కలసి సహపంక్తి భోజనాలు చేసిన తరువాత సాయంత్రం ఎవరి ప్రాంతాలకు వారు తరలి వెళ్లారు.

నేటి నుంచి అమ్మ జాన్ ఉరుసు మహోత్సవం


విలేకరులతో మాట్లాడుతున్న ఖాజా మొహిద్దీన్

ఏ.కొండూరు: చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్‌లో ఈ నెల 24, 25, 26 తేదీల్లో నఖిబుల్ ఔలియా సూఫీ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి ఔలియా బాబా ధర్మపత్ని సర్వోన్నత సూఫీ మహనీయ జనని మొహమ్మద్ ఖమ్రున్నిసా బేగమ్ పావన ద్వితీయ సూఫీ సుగంధ ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు దర్బార్ పీఠాధిపతి పీర్జాద మొహమ్మద్ ఖాజామొహిద్దీన్ షా తాజ్ ఖాదరి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ దర్బార్‌లో ఆరున్నర దశాబ్దాల నుంచి అన్నామృత ప్రసాదం తన స్వహస్తాలతో వండి వడ్డించిన ఆమె జీవితం సేవకు సజీవ నిర్వచనమన్నారు. చీమలపాడు బాబా వారు అన్నామృత ప్రసాద వితరణ తన జీవిత లక్ష్యంగా భావించి తన జీవితంలోని ప్రతి క్షణాన్ని ధారపోసిన అమ్మ ఉరుసును ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. 24వ తేదీన ఉరుసు ప్రారంభం, దివ్య ఖురాన్ పారాయణం, మహాదివ్య అన్న సమారాధన, 25న అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి ఔలియా వారి దర్గాలో పవిత్ర చాదర్ సమర్పణ, పుష్పాంజలి, 26న పీఠాధిపతి పీర్ జాదా మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా తాజ్‌ఖాదరి వారి ఆధ్యాత్మిక సందేశం, ఉరుసు ముగింపు ఉంటుందన్నారు. కుల మతాలకు అతీతంగా భక్తులు విచ్చేసి ప్రసాదాన్ని స్వీకరించాలన్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

సంధ్యాసమయం.. సుమనోహరం



జగ్గయ్యపేట పట్టణంలోని రైతు బజారు సెంటర్‌లో ఆదివారం సాయంత్రం సూర్యాస్తమయం కనువిందు చేసింది. సాయంత్రం చీకట్లు కమ్ముకుంటుండగా సూర్యాస్తమయం వేళ సూర్యుని నుంచి వచ్చే కిరణాలు ఆకాశాన్ని బంగారు వర్ణంలోని మార్చాయి. రైతుబజారు సెంటర్‌లోని విద్యుత్ దీప స్తంభం మధ్యలో నుంచి సూర్యుడు అస్తమిస్తున్నట్లుగా కనిపించిన ఈ మనోహర దృశ్యాన్ని అటుగా వెళ్లేవారు, స్థానికులు చూసి పరవశించిపోయారు.

–జగ్గయ్యపేట అర్బన్

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

ఆగిరిపల్లి: అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యమైనట్లు ఎస్ఐ ఎన్.చంటిబాబు ఆదివారం తెలిపారు. వట్టిగుడిపాడుకు చెందిన సింహాద్రి నాగమల్లేశ్వరరావు ఈ నెల 10న ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల వద్ద, చుట్టుపక్కల వెదికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. అప్పులు చేయడం వల్ల మనస్తాపంతో ఇంట్లోంచి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ చంటిబాబు సిబ్బందితో రెండు బృందాలుగా ఏర్పడి బంధువుల సహాయంతో వట్టిగుడిపాడు శివారు తోటల్లో ముమ్మరంగా గాలించారు. అక్కడ నాగమల్లేశ్వరరావును గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వెళ్లి విచారించారు. అప్పుల బాధతో ఇంట్లోంచి వెళ్లిపోయానని తెలిపాడు. అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



వత్సవాయి : గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ భూక్యా సీతమ్మ ఆదివారం ప్రారంభించారు. గాంధీపార్కు సెంటర్‌లో పాదాచారుల కోసం ఏర్పాటుచేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఎండలు తగ్గే వరకు ప్రత్యేకంగా మనిషిని కేటాయించి తాగునీటిని పోయనున్నట్లు చెప్పారు. వత్సవాయి పంచాయతీ ఈవో షేక్ ఇమామ్‌సాహెబ్, యేశపోగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకే ..



చట్టన్నవరం(వీరులపాడు): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా ముందుకు రావాలని సర్పంచ్ చలమాల దుర్గారావు పేర్కొన్నారు. మండలంలోని చట్టన్నవరం గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు చలమాల లక్ష్మయ్య, అనసూయమ్మల జ్ఞాపకార్థం గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. ప్రజల దాహార్తిని తీర్చటంలో చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.

కాళీమాతకు విశేషాలంకరణ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శాంతినగర్ కోదాడ రోడ్‌లో వేంచేసియున్న కలకత్తా కాళీమాత విశ్వరూప శివదుర్గా భవాని మాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేషాలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు తానూరి శ్రీనివాసరావు నిమ్మకాయల దండలు, పూలదండలతో విశేషాలంకరణ చేసి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

గురు విశ్వస్ఫూర్తి మార్గమే శిరోధార్యం



పెనుగంచిప్రోలు: నవ సమాజ నిర్మాణానికి గురు విశ్వస్ఫూర్తి మార్గమే శరణ్యమని పలువురు వక్తలు తెలిపారు. స్ఫూర్తి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఆయన సమాధి వద్ద విశ్వస్ఫూర్తి భౌతిక నిష్క్రమణ కార్యక్రమాలు హోమాలు, ప్రత్యేక పూజలతో ముగించారు. ఈ సందర్భంగా పలువురు స్ఫూర్తి కుటుంబ వక్తలు మాట్లాడుతూ మానవ జాతి ఉద్ధరణ కోసం ఆయన ఎంతో ప్రయత్నించారన్నారు. మానవత్వాన్ని ప్రతి ఒక్కరిలో పెంపొందించేలా ఎన్నో గ్రంథాలు రాశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రజలకు వివరించి చైతన్యవంతులుగా చేయాలన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలి వచ్చారు.

జగ్గయ్యపేటలో వడగళ్ల వాన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలయింది. అనంతరం పది నిమిషాల పాటు వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. కొన్ని రోజులుగా ఎండలు, వడగాడ్పులు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పట్టణ ప్రజలు ఈ వర్షానికి సేద తీరారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

ఆగిరిపల్లి: మండలంలో రెండు గ్రామాల్లో జూదమాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎన్.చంటిబాబు ఆదివారం తెలిపారు. ఆగిరిపల్లిలో పేకాడుతున్న నలుగురిని, నెక్కలం గొల్లగూడెంలో నంబర్లాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,150 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు 'స్పందన'

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్డీవో రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన నిర్వహిస్తుందని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- **కంచికచర్ల:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి ఆదివారం తెలిపారు. గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు అందించాలని కోరారు.

ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులు

కంచికచర్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీచాయి. మండలంలోని కీసరలో ఓ ఇంటి పైకప్పుకు వేసిన రేకులన్నీ లేచిపోయాయి. అయితే ఎటువంటి ప్రాణ నష్టము జరగలేదని స్థానికులు తెలిపారు. హైవే పక్కన చెట్ల కొమ్మలు విరిగిపోయి నేలకొరిగాయి.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

నందిగామ: పట్టణంలోని నెహ్రూనగర్ లో గల శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు స్వామివారికి పలు విశేష పూజలు, వసంతోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.

మైలవరం జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా శైలజ



మైలవరం: మైలవరం జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా శైలజ నియమితులయ్యారు. అమరావతి హైకోర్టు జ్యుడీషియల్ విభాగంలో సాధారణ బదిలీలు జరుగగా, ఇప్పటి వరకు మైలవరం జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న షేక్ షిరీన్ తూర్పు గోదావరి జిల్లా కాకినాడ 5వ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు నిర్వహించిన మద్దిబోయిన శైలజ బదిలీపై మైలవరం రానున్నారు. జడ్జి షేక్ షిరీన్ ఈ నెల 26న మైలవరంలో రిలీవ్ కానుండగా అదే రోజు జడ్జి శైలజ బాధ్యతలు స్వీకరించనున్నట్లు కార్యాలయం తెలిపింది.

ఆలయాల్లో చందనోత్సవం



తిరువూరు: వైశాఖ మాస ప్రారంభ సందర్భంగా తిరువూరులోని పలు ఆలయాల్లో ఆదివారం చందనోత్సవం నిర్వహించారు. శ్రీవేంకటాచల స్వామి దేవస్థానంలో జరిగిన చందనోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ అనుమోలు ముత్తారావు పర్యవేక్షించారు. శ్రీరాజ్యలక్ష్మీ సమేత రంగనాయక స్వామి దేవస్థానంలో స్వామికి జరిపిన చందనోత్సవంలో ఆలయ చైర్మన్ దారా రంగారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

నూజివీడు: బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్‌లో చేరేందుకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్షను ఆదివారం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఐదో తరగతి ఎంట్రన్స్ పరీక్షకు 400 మంది నమోదు చేసుకోగా 364 మంది హాజరవ్వగా, 36 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఇంటర్ ప్రవేశ పరీక్షకు 327 మంది రిజిస్టర్ చేసుకోగా అందులో 20 మంది గైర్హాజరయ్యారు. 307 మంది పరీక్షను రాశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రిన్సిపాల్ ఆర్.లక్ష్మి ఏర్పాట్లు చేశారు.

27 నుంచి బ్రహ్మోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ శేషయ్యవీధిలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని పాండురంగస్వామి దేవస్థానంలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షులు గొల్లపూడి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 27న తిరుమంజనం, 28న తిరుకల్యాణోత్సవం, సాయంత్రం సహస్ర దీపాలంకరణ, 29న స్వామి వారికి పుష్పయాగం జరుగుతాయని వివరించారు.